జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
బుధవారం | 11 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 10


ప్రభుత్వ ధరలకు మించి బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరిక
- జిల్లా వ్యాప్తంగా 50 దుకాణాల్లో తనిఖీలు.. 9 కేసులు నమోదు
- ప్రతి దుకాణం ఎదుట ధరలు, నిల్వల వివరాల బోర్డు తప్పనిసరి



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 10 ప్రజాజ్యోతి: జిల్లాలో బియ్యం కృత్రిమ కొరత సృష్టించినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి విక్రయించినా సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. బియ్యం అక్రమ నిల్వలకు పాల్పడకుండా, వినియోగదారులకు నిర్ణీత ధరలకే మిగతా 2 లో...

- క్రీడాకారుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారా?
- మిగిలిన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని స్టేడియానికి కేటాయించాలి
- ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకుంటాం.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- భూవ్యవహారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం



కోరుట్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణం ఏమైంది?

కోరుట్ల, నవంబర్ 10 (ప్రజాజ్యోతి) కోరుట్ల నియోజకవర్గ యువతకు క్రికెట్ స్టేడియం నిర్మిస్తామన్న హామీ ఏమైందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. యువతకు క్రీడా సౌకర్యాలు కల్పించి, స్థానిక క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన ప్రభుత్వ భూముల విషయంలో ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేశారు.కోరుట్ల పట్టణంలోని సర్వే నంబర్ 1304లో ఉన్న ప్రభుత్వ భూమిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని గతంలో తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు హామీ ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆ హామీ అమలుకు నోచుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తున్నారా?

మహిళా సాధికారత పథకం కింద ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని పెట్రోల్ బంకు కోసం కేటాయించినట్లు ప్రచారం జరుగుతోందని, మిగిలిన విలువైన భూమిని కూడా ప్రైవేటు వ్యక్తులకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజల అవసరాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూములను వ్యక్తిగత ప్రయోజనాలకు కేటాయించడం సరైన విధానం కాదన్నారు. ఈ భూముల కేటాయింపులపై ప్రభుత్వం పూర్తి వివరాలతో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మిగిలిన 10 ఎకరాలతో క్రికెట్ స్టేడియం నిర్మించాలి

సర్వే నంబర్ 1304లో మిగిలి ఉన్న పది ఎకరాల ప్రభుత్వ భూమిని మిగతా 2 లో...

గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్...

వీరాపూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం...

రాయికల్, నవంబర్ 10 (ప్రజాజ్యోతి) రాయికల్ మండలం వీరాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యమని తెలిపారు. రాయికల్ మండలంలో ఇప్పటివరకు 911 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 732 నిర్మాణ దశలో ఉన్నాయని, వీరాపూర్‌లో ఇప్పటికే 12 ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరో 21 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. వీరాపూర్–రామాజీపేట రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిస్తూ విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల రైతుల కోసం రైతుబజార్లు, మార్కెట్లను అభివృద్ధి చేసి హోల్‌సేల్ మార్కెట్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి, మిగతా 2 లో...

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

5 లో...



సమిష్టి కృషితో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం..

- ఆరుతడి పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



సుల్తానాబాద్, నవంబర్ 10(ప్రజాజ్యోతి) : రానున్న ఎల్‌నినో ప్రభావాన్ని సమిష్టికృషితో ఎదుర్కొనికరువు పరిస్థితులను అధిగమించాలనిరాష్ట్రప్రభుత్వవిప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాల నేపథ్యంలో ప్రజలు, రైతులు ముందస్తుగా అప్రమత్తం కావాలని సూచించారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతులు అధిక నీటి అవసరమయ్యే మిగతా 2 లో...

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

9 లో...



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



చిగురుమామిడి /నవంబర్ 10, ప్రజాజ్యోతి రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపూర్, రేకొండ, బొమ్మనపల్లి, నవాబుపేట, ఉల్లంపల్లి, రామంచ, ముల్కనూర్ తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారికంగా వారు ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, తార్పాలిన్లు వంటి అవసరమైన అన్ని వసతులను కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పూర్ణచందర్ ,సర్పంచులు గోగూరి లక్ష్మి మురహరి రెడ్డి, కొంకట మౌనిక,గూళ్ళ రజిత రాజు,ఒంటెల కిషన్ రెడ్డి,అలువాల శంకర్,సాంబారి భారతమ్మ కొమురయ్య,ఐకెపి ఎపిఎం రజిత,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బదుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,ఉపసర్పంచులు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,కాసర్ల హరీష్, బిల్లా సంతోష్ రెడ్డి,శ్రీనివాస్, పైడిపల్లి వెంకటేష్ గౌడ్,సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి, కుతాటి తిరుపతి,పిల్లి కొమురయ్య,చాడ మహిపాల్ రెడ్డి,మర్రి శ్రీనివాస్,రేకొండ డీసీఎంఎస్ నిర్వాకుడు దొడ్ల తిరుపతిరెడ్డిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం..

(మొదటి పేజీ తరువాయి...)



వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మొక్కజొన్న, వేరుశనగ,నువ్వులు,పొద్దుతిరుగుడు,పత్తి తదితర పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో సర్పంచులు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ భవిష్యత్తులో తాగునీరు,సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. జనవరి వరకు ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగే అవకాశాలున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, తహసీల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నామని రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకు మించి బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)

బియ్యం విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. అక్టోబర్ 30న కలెక్టర్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని పలు హోల్‌సేల్, రిటైల్ బియ్యం దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దుకాణాలు, గోదాముల్లోని బియ్యం నిల్వలతో పాటు ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ/కేఎన్ఎం రకం బియ్యం మిల్లు వద్ద కిలో రూ.62, హోల్‌సేల్ ధర రూ.64, రిటైల్ ధర రూ.66గా, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రకం బియ్యం ధరలు వరుసగా రూ.70, రూ.72, రూ.74గా, హెచ్ఎంటీ/జై శ్రీరామ్ రకం బియ్యం ధరలు రూ.75, రూ.77, రూ.79గా నిర్ణయించినట్లు వివరించారు. నిర్ణీత ధరలకు మించి విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం, మిల్లు ఎదుట రోజువారీ బియ్యం నిల్వలు, ప్రభుత్వం నిర్ణయించిన విక్రయ ధరలను వినియోగదారులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ లైసెన్స్, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతిపత్రాలను తనిఖీ అధికారులకు చూపించాలని, రోజువారీ కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. 26 కిలోల బియ్యం బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బియ్యం విక్రయించినా మోసపూరిత కొలతల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 4, 2026 నాటికి జిల్లా వ్యాప్తంగా 50 బియ్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, అక్రమ నిల్వలు, ధరల ట్యాంపరింగ్, తూకాల్లో తేడాలు, రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.

కోరుట్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణం ఏమైంది?

(మొదటి పేజీ తరువాయి...)

వెంటనే క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు వసీం,సురేందర్,బాబా,మోసిన్,మహేష్‌తో పాటు నరేష్, జాల వినోద్, కిరణ్ తదితరులు డిమాండ్ చేశారు.కోరుట్ల ప్రాంతంలో ఎంతోమంది యువకులు క్రికెట్‌తో పాటు వివిధ క్రీడలపై ఆసక్తి చూపుతున్నారని,వారికి సరైన మైదానం, అవసరమైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్టేడియం నిర్మిస్తే స్థానిక క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పోరాటం

ప్రభుత్వ భూముల కేటాయింపుల విషయంలో స్థానిక కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు, యువతకు ఉపయోగపడేలా వాటిని క్రీడా అవసరాలకు వినియోగించాలని కోరారు. మిగిలిన పది ఎకరాల భూమిని క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని, ప్రైవేటు వ్యక్తులకు భూములు అప్పగించే ప్రయత్నాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను,యువతను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు,ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

కార్తీక మాస ప్రారంభం: వేములవాడ రాజన్న ఆలయంలో 'ఆకాశ దీపం' ఆవిష్కరణ



వేములవాడ,నవంబర్,10:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, జపాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా 'ఆకాశ దీపాన్ని' వెలిగించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేద పండితులు ఏకాంతంగా నిర్వహించినట్లు ఆలయ పీఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు.

జాతీయస్థాయి థాంగ్ టా పోటీల్లో ఐపీఎస్ విద్యార్థి ప్రతిభ

మనోజ్ కార్తిని అభినందించిన పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్



సుల్తానాబాద్, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): ఢిల్లీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి థాంగ్ టా పోటీల్లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ (ఐపీఎస్) విద్యార్థి టి.మనోజ్ కార్తి పాల్గొని ప్రతిభ కనబరిచాడు. 17 ఏళ్ల బాలుర విభాగంలో పదో తరగతి చదువుతున్న మనోజ్ కార్తి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ విద్యార్థిని పుష్పగుచ్ఛంతో అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, రజిత, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకూతుళ్ల పార్థివ దేహాలకు నివాళులర్పించిన మంత్రి పొన్నం



చిగురుమామిడి /నవంబర్ 10, ప్రజా జ్యోతి హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ప్రమాదంలో చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన తొమ్మిదేళ్ల కుమార్తె మహాన్వి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మంగళవారం మృతుల స్వగ్రామమైన కొండాపూర్‌కు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్,శ్రీకాంత్, మహాన్వి పార్థివ దేహాలకు పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు.ఒకే కుటుంబంలో యాజమానితో పాటు చిన్నారి కూతురు కూడా రోడ్డు ప్రమాద మహమ్మారికి బలికావడం అత్యంత హృదయవిదారకమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మృతుల కుటుంబ సభ్యులను, బంధువులను కలిసి మంత్రి ఓదార్చారు.వారిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.గుండెకోతతో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని,అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,నాయకులు వంగర మల్లేశం,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,గ్రామస్థులు మృతులకు నివాళులర్పించారు.

గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి...)



సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామస్వామి, జిల్లా ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రవీందర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ ధీటీ రాజిరెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, మాజీ సర్పంచ్ మల్లయ్య, ఉపసర్పంచ్ నర్సారెడ్డి, కిషన్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ స్వామి రెడ్డి, నాయకులు కోల శ్రీనివాస్, బెజ్జంకి మోహన్ ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేందర్ నాయక్, సర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి ఎమ్మెల్యే విజ్జన్న



ఎలిగేడు నవంబర్ 10 (ప్రజా జ్యోతి) మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి , రాముల పల్లె, బురహాన్ మియాపేట గ్రామంలో సింగిల్ విండో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు (విజ్జన్న) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి,ధాన్యంకొనుగోలు ప్రక్రియ గురించి సంబంధిత అధికారులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని ని ర్వాహకులకు సూచించారు. ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సమరాహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్యాల రమేష్, మండల సర్పంచులు, ఏలేటి వెంకట్రెడ్డి ,కప్పల ప్రవీణ్, మారం కొమురయ్య,గోపు రజిత లక్ష్మా రెడ్డి,సిద్ధి తిరుపతి యాదవ్ , మద్దెల రమాదేవి సంపత్, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లాపూర్ గ్రామంలో అంగన్వాడీలో 10 నిమిషాల కార్యక్రమం

- అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- సూపర్వైజర్ వనిత



తంగళ్ళపల్లి, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): తంగళ్ళపల్లి మండలం మల్లాపూర్ గ్రామంలో నీ అంగన్వాడీలో పది నిమిషాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పెషల్ ఆఫీసర్ (ఇంచార్జ్)డిపిఓ వీరభద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు, అందించాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు. అలాగే అంగన్వాడీ ద్వారా అందుతున్న సేవలను సద్వినిగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల్లో అందించే పోషకాహారంతో పిల్లలు, గర్భిణీలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. వీరి వెంట ఎంపీడీవో రమేష్, ఎంపీఓ మిర్జా, సూపర్వైజర్ వనిత, గ్రామపంచాయతీ కార్యదర్శి పావని, గర్భిణీ మహిళలు, పిల్లల యొక్క తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఊపిరిలూదిన అందెశ్రీ... రోమాలు నిక్కబడిచే పాటలు

- జోల పాటలు కాదు పోరు పాటలు... అందెశ్రీ ప్రస్థానం
- విక్కుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు



వేములవాడ,నవంబర్,10:ప్రజాజ్యోతి. జయ జయహే తెలంగాణ గీతంతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి, తన కలాన్ని ఉద్యమ జెండాగా మలిచి తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన ప్రజాకవి అందెశ్రీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ "చదువుకు, అక్షరానికి దూరంగా పెరిగినా.. సహజ సిద్ధమైన ప్రతిభతో అగ్రశ్రేణి కవిగా, తెలంగాణ రాష్ట్రగేయ రచయితగా ఎదిగిన అందెశ్రీ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని, ప్రకృతిని గురువుగా చేసుకొని, తెలంగాణ ఆత్మను పలికించిన అందెశ్రీ పాటలు, కవిత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, అందెశ్రీ బాల్యం అంతా పల్లెటూరి ప్రకృతితో, పశువుల మందతోనే గడిచిందని, పైరగాలిలో, పక్షుల గుంపులో, కొండ వాగులో మట్టి వాసనలో ఆయన మనసు కవిత్వం అల్లిందని, ఆ ప్రకృతి అనుభవమే ఆయనకు గురువుగా, బడిగా మారిందని, ఆయన పాటలు, కవిత్వం కేవలం పదాల కూర్పు కాదని, తెలంగాణ నేల ఆత్మను పలికించే సహజసిద్ధమైన ఆశువు కవిత్వమని, అందెశ్రీ తాపీ పని నేర్చుకోవడానికి నిజామాబాద్ వెళ్ళినప్పుడు శృంగేరి మఠానికి చెందిన స్వామి శంకర్ మహరాజ్ ఆయన పాటలు విన్నారని, ఆశువుగా అద్భుతమైన కవిత్వం చెప్పే ఆయన ప్రతిభను గుర్తించి, చేరదీసి ఆయన పేరును అందెశ్రీగా మార్చారని, ఇక్కడి నుంచే ఆయన జీవితం కొత్త మలుపు తిరిగిందని, ఆతర్వాత తన పాటల ద్వారా ప్రజల కష్టాలను, ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని, అందెశ్రీ రాసిన 'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు'పాట ఎంతోమంది మనసులను కదిలించిందని, అలాగే 'కొమ్మ చెక్కితే బొమ్మ రా' లాంటి అనేక జానపద, విప్లవాత్మక గీతాలు తెలుగు సినిమా రంగంలో కూడా ఆయనకు గొప్ప గుర్తింపును తెచ్చాయని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాత్ర మహోన్నతమైనదని, ఆయన ధూంధాం కార్యక్రమం రూపశిల్పిగా, తెలంగాణ 10 జిల్లాల ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాడని, తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన 'జయ జయహే తెలంగాణ, జననీ జయకేతనం' గీతాన్ని అందెశ్రీనే రచించారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఈ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర గేయంగా ప్రకటించిందని, నిరక్షరాస్యుడైన అందెశ్రీ అపారమైన సాహిత్య సేవకు గుర్తింపుగా కాకతీయ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసిందని, ఏనాడు బడికి వెళ్లక పోయినా.. అక్షరం ముక్క రాకపోయినా.. అందెశ్రీ తెలంగాణ సాహిత్యానికి చుక్కానిగా నిలిచారని" పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గేటి లక్ష్మీనారాయణ,కంకెల్కార్ మోహన్,అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష మందితో కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర

- హాజరుకానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- కేంద్ర మంత్రి బండి సంజయ్





కరీంనగర్ బ్యూరో,నవంబర్ 10 (ప్రజాజ్యోతి): కరీంనగర్‌లో త్వరలో లక్ష మందితో బీజేపీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తొలిసారిగా కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా చర్చ జరిగేలా మహా పాదయాత్రను నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ పాదయాత్రకు నితిన్ నబిన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.మహా పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు మంగళవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో బండి సంజయ్ సమావేశమయ్యారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ యాత్రకు కనీసం లక్ష మందిని సమీకరించే లక్ష్యంతో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'సర్' పేరిట కాంగ్రెస్, ఇండీ కూటమి విపక్షాలు రాజ్యాంగ సంస్థలపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజలకు వాస్తవాలను వివరించేందుకే నితిన్ నబిన్ కరీంనగర్ పర్యటనకు వస్తున్నారని తెలిపారు.మహా పాదయాత్రలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు,ప్రజలు పాల్గొనేలా పోలింగ్ బూత్ స్థాయి నుంచి శక్తి కేంద్రాలు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని నేతలకు సూచించారు. జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, మీడియా, సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు.ఈ సమావేశంలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపీ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ, గంగాడి కృష్ణారెడ్డి, సీనియర్ నేతలు కోమల అంజనేయులు, నల్లాల ఓదేలు, మోహన్ రెడ్డి, బోయినిపల్లి ప్రవీణ్ రావు, గుజ్జ శ్రీను, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కోహెడ వెంకన్న, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

- ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి
- కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి
- చాడ వెంకటరెడ్డి





కరీంనగర్, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. కరువును జాతీయ విపత్తుగా ప్రకటించే వరకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి కొనసాగించాలని కోరారు.కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వర్షాభావం, సాగునీటి కొరతతో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి ఎండిన వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చికి రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు కార్యాలయాల్లో కూర్చొని నివేదికలు రూపొందించకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు.కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు తీసుకురావాలని, గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా మెట్ట ప్రాంతాలకు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందెస్వామి, జిల్లా నాయకులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, రైతు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతుల వివాహ వార్షికోత్సవం



కరీంనగర్, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.లయన్స్ క్లబ్ కరీంనగర్ ఫౌండేషన్,గౌరిశెట్టి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేయర్ దంపతులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.నగరంలోని వెంకటేశ్వర టెంపుల్ చౌరస్తా వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు గౌరిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ఆయా సంస్థల నిర్వాహకులు మేయర్ దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పలువురు పాలకవర్గ సభ్యులు పాల్గొని పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లందకుంటలో నేడు కృత్రిమ మేధస్సు శిక్షణ కేంద్రం ప్రారంభం

- గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక విద్య అందించడమే లక్ష్యం



ఇల్లందకుంట, నవంబర్ 10 (ప్రజాజ్యోతి):గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో ఇల్లందకుంటలో కృత్రిమ మేధస్సు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. నవంబర్ 11వ తేదీ ఉదయం 10:50 గంటలకు ఇల్లందకుంటలో ఈ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు ఎంతో కీలకంగా మారుతున్నవేపథ్యంలో గ్రామీణ ప్రాంత యువతకు సైతం ఈ పరిజ్ఞానంపై అవగాహన, శిక్షణ కల్పించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేయడం విశేషం. ఈ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువత నూతన సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకొని భవిష్యత్తులో మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవకాశం కలగనుంది.గ్రామీణ యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి, పట్టణ ప్రాంతాలకు దీటుగా వారిని తీర్చిదిద్దేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమానికి వైయూప్ టీవీ, ట్యూరిటో సంస్థల వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వహణాధికారి పాడి ఉదయ్ నందన్ రెడ్డి ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమానికి విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆహ్వానకులు కోరారు.

ఎల్‌నినో ప్రభావం – వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం



ఎల్లారెడ్డిపేట నవంబర్ 10 (ప్రజా జ్యోతి)ఎల్లారెడ్డిపేట మండల MPDO కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, MPDO, మండల పంచాయతీ అధికారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఇంట్రా, మిషన్ భగీరథ), అసిస్టెంట్ ఇంజినీర్లు (ఇంట్రా, గ్రిడ్), మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు సర్పంచులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 2026 నవంబర్ 15 నుండి డిసెంబర్ 31 వరకు అమలు చేయనున్న వేసవి కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, నీటి వనరులను గుర్తించడం, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడం, మోటార్ల మరమ్మతులు చేపట్టడం, నీటి వృథాను నివారించడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.వేసవిలో ప్రతి గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా అందేలా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి

- 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ.. సన్న వడ్లకు రూ.500 బోనస్
- యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు





సుల్తానాబాద్, నవంబర్ 10 ప్రజాజ్యోతి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని నరసయ్యపల్లి, బొంతకుంటపల్లి, గర్రెపల్లి, భూపతిపూర్, నారాయణపూర్ గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితులు ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యాసంగిలో అధిక నీటి వినియోగంతో కూడిన వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే మొక్కజొన్న, శనగ తదితర ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని,ధాన్యం సేకరణలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో గ్రం థాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంత టి అన్నయ్య గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినపల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు చిలుక సతీష్ కల్లపల్లి జానీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్రావు డైరెక్టర్లు,ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు, యువత, రైతులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంథని పట్టణంలో రోడ్డు నిర్మాణ, విస్తరణ పనులను వేగవంతం చేయాలి

- రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు పనులు త్వరగా పూర్తి చేయాలి
- పనుల పరిశీలనలో పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): గోదావరి పుష్కరాల దృష్ట్యా మంథని పట్టణంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ, విస్తరణ పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథని మున్సిపల్ పరిధిలోని మంథని–గోదావరిఖని రహదారి నిర్మాణ పనులను, పుష్కర ఘాట్ సమీపంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను, శ్రీ మహాలక్ష్మి ఆలయ రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంథని పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి,రోడ్డు విస్తరణ పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మంథని–గోదావరిఖని రహదారి, పుష్కర ఘాట్ సమీపంలోని రోడ్డు నిర్మాణ పనులు, శ్రీ మహాలక్ష్మి ఆలయ రోడ్డు విస్తరణ పనులను నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణ, విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ పర్యటనలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్.ఈ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఫార్మనోవా – అనాటమీ 3D ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

- మానవ శరీర అవయవాలపై విద్యార్థుల వినూత్న 3D నమూనాల ప్రదర్శన
- విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభను అభినందించిన కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 10 ప్రజా జ్యోతి:మదర్ థెరిసా ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం ఫార్మనోవా –అనాటమీ 3D ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శనలో ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మానవ శరీర నిర్మాణంపై రూపొందించిన వినూత్న 3D నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గుండె, మెదడు, ఊపిరితిత్తులు, జీర్ణవ్యవస్థ, అస్థిపంజర వ్యవస్థ తదితర మానవ శరీర భాగాలకు సంబంధించిన నమూనాలను విద్యార్థులు సృజనాత్మకంగా రూపొందించి, వాటి నిర్మాణం, పనితీరును వివరించారు. పుస్తకాలకే పరిమితమైన విజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా ప్రదర్శిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాస్, పవన్, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి వారి సృజనాత్మకతను, ప్రతిభను అభినందించారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.“ ఎక్స్‌ప్లోర్ – లెర్న్ – ఎక్స్‌పీరియన్స్” నినాదంతో నిర్వహించిన ఈ ప్రదర్శన విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించింది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

- సాగునీరు, నాణ్యమైన విద్యుత్, మద్దతు ధర కల్పిస్తాం
- మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





కోనరావుపేట, నవంబర్. 10 (ప్రజాజ్యోతి) రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, రైతును రాజుగా చూడాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మంగళవారం కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ గోదామును రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు.బుధవారం కోనరావుపేట మండలంలో రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు.గతంలో రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధరతో పాటు అవసరమైన సందర్భాల్లో బోనస్ అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తే రైతులు అక్కడ విక్రయించుకోవచ్చని, లేనిపక్షంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

›» సన్నధాన్యానికి రూ.500 బోనస్

వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ నిపుణుల సూచనల మేరకు అధిక దిగుబడులు, మార్కెట్‌లో మంచి ధర లభించే ఏడు రకాల సన్నవడ్ల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించే నిర్ణయం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారిందన్నారు. కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అందించడం ద్వారా రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

›» రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 19 సబ్‌స్టేషన్లు

వేములవాడ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 19 నూతన సబ్‌స్టేషన్లను మంజూరు చేయించామని తెలిపారు. 33/11 కేవీ, 132/33 కేవీ విద్యుత్ సదుపాయాలను మెరుగుపరుస్తూ వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

›» రైతులకు రూ.20,650 కోట్ల రుణమాఫీ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,650 కోట్ల మేర ఏకకాలంలో రుణమాఫీ చేసి ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులు, వడ్డీ భారాలు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

›» ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గింది

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి ప్రాజెక్టుల్లోకి గత ఏడాదితో పోలిస్తే తక్కువ నీరు చేరిందని ఆది శ్రీనివాస్ వివరించారు. గత ఏడాది సుమారు 400 టీఎంసీలకు పైగా నీరు చేరగా, ఈ ఏడాది 200 టీఎంసీలకు పైగా మాత్రమే చేరిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన పరిస్థితులను రాజకీయ కోణంలో చూడటం సరికాదని, కరువు పరిస్థితులు కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలు ఈ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఒక ఊరకుంట, ప్రతి పొలం వద్ద ఒక నీటి గుంట, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చెరువులు, కాలువల మరమ్మతులు, నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు అవసరమైన ప్రతిపాదనలు అందిస్తే నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.అవసరమైన సందర్భాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ.కోటి చొప్పున నిధులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాబోయే జనవరి నుంచి ఏప్రిల్, మే నెలల వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి వనరుల అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందన్నారు.

›» విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. కోడూరుపేట ప్రాంతంలో సుమారు 1,500 మంది విద్యార్థులు చదువుకునేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, దేవస్థానాల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, వంతెనల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నామని వివరించారు.గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

›» అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఐదు గ్యారంటీలను అమలు చేస్తూ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, మొదటి విడతలో వేములవాడ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. మరో 2,000 ఇళ్లను మంజూరు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. భవిష్యత్తులోనూ అర్హులైన పేదలందరికీ ఇళ్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.చివరగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నూతన పాలకవర్గ సభ్యులు ప్రత్యేక చొరవ చూపాలని ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రైతులకు అండగా నిలుస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమం, సాగునీటి వసతులు, విద్యుత్ సరఫరా, విద్య, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లు బొమ్మాన భాస్కర్ రావు, చేపూరి గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షులు మానుక సత్యం, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా, గొట్టే రుక్మిణి, ఏఎంసీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బండ నరసయ్య యాదవ్, తహసీల్దార్ వరలక్ష్మి , సర్పంచులు అప్పల నాగభూషణం ,లక్ష్మా రెడ్డి, కాశీరాం, దీపిక, నాగభూషణం, ఉపసర్పంచ్ రామోజీ సాయి, కొలనూర్ సింగిల్ విండో డైరెక్టర్లు వీరబోయిన తిరుపతి యాదవ్, ఉప్పుల గంగయ్య, సుంకరి రెడ్డి, జాగిడి బాపు రెడ్డి, చిద్రవేణి సరిత, నిరటి సంజీవ్, నుగురి గణేష్ , ఐదారి శ్రీనివాస్, కార్తీక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్

- రైతులందరూ రీ-సర్వేకు సహకరించాలి
- అదనపు కలెక్టర్ జి. నాగేశ్



ముస్తాబాద్: నవంబర్ 11 (ప్రజా జ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మోర్రపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ–సర్వే పనులను అదనపు కలెక్టర్ జి. నాగేశ్, జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ–సర్వే ప్రక్రియ, ఇప్పటివరకు పూర్తయిన పనుల పురోగతి, భూములకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులు పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.రీ–సర్వే కార్యక్రమంలో రైతులందరూ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సర్వే సిబ్బందికి అందజేస్తూ సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో భూ సమస్యలకు తావు లేకుండా రీ–సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రైతుల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ తహసీల్దార్, గిర్దావర్, సర్వే సిబ్బంది, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని సీపీ ఆకస్మిక తనిఖీ



కరీంనగర్ క్రైం, నవంబర్ 10, (ప్రజాజ్యోతి):కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని మంగళవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి,వివిధ విభాగాల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.పాస్‌పోర్ట్ వెరిఫికేషన్,ఉద్యోగ ధ్రువీకరణ,పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై ఆరా తీశారు.వెరిఫికేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తులపై తక్షణమే స్పందించాలని సూచించారు.అలాగే సోషల్ మీడియా విభాగం పనితీరును సమీక్షిస్తూ,ఫీల్డ్ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి సమాచార సేకరణను వేగవంతం చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఏసీపీ శ్రీనివాస్,ఇన్‌స్పెక్టర్ అనిల్,డీఏపీ విరాజ్ తో పాటు ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట నవంబర్ 10 ప్రజాజ్యోతి ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి ఆయకట్టు రోడ్డు మరియు వివిధ అభివృద్ధి పనుల గురించి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస రెడ్డి నాయకులు కోరుట్ల పేట గ్రామానికి రోడ్డు పనులు వివిధ అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరారు.

ఆరుతడి పంటల సాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఎల్లారెడ్డిపేట నవంబర్ 10 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో ఆరుతడి పంటలు, కూరగాయల తోటలను జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమా అగర్వాల్ గారు పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామానికి విచ్చేసిన కలెక్టర్ గారికి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ స్వాగతం పలికారు. ఆరుతడి పంటలను సాగు చేస్తున్న రైతు గుర్రాల సత్తి రెడ్డి దంపతులతో కలెక్టర్ గారు మాట్లాడి, వారి వ్యవసాయ విధానాలను తెలుసుకున్నారు. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లోనూ ఆరుతడి పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సత్తిరెడ్డి దంపతులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గారు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, తహసీల్దార్ (ఎంఆర్ఓ), ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి, గ్రామ ఉపసర్పంచ్, మనమ్మ వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొలనూరు సింగిల్ విండో చైర్మన్ కు ఘన సన్మానం

- అయ్యప్ప గురుస్వామి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో సత్కారం



కొనరావుపేట,నవంబర్ 10(ప్రజాజ్యోతి)కొనరావుపేట మండలం కొలనూరు సింగిల్ విండో చైర్మన్ బొమ్మన భాస్కర్ రావు కు అయ్యప్ప గురుస్వామి తాళ్లపల్లి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మన భాస్కరరావుతో పాటు సింగిల్ విండో డైరెక్టర్లు నూగురి గణేష్, అయిదరి శ్రీనివాస్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వామి తాళ్లపల్లి సతీష్ గౌడ్ మాట్లాడుతూ, సమాజంలో సేవాభావంతో ముందుకు సాగుతూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించే వారిని గౌరవించడం అనందంగా ఉందన్నారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు పెద్ది మల్లేశం, రామచంద్రం, పరశురాములు, సుంకరి బాలకిషన్, దేవేందర్, యాదవ్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్



మెట్ పల్లి, నవంబర్ 10,ప్రజా జ్యోతి: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ఈనెల 14న మెట్ పల్లి పట్టణంలోని వెంకటరెడ్డి గార్డెన్స్ లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యం తో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ పోరాటాలతోనే అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం

- 35 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం.. ఇక రాజ్యాధికారమే లక్ష్యం
- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి చెన్నూరి శ్రీనివాస్



సుల్తానాబాద్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): అణగారిన వర్గాల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ సాగించిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి చెన్నూరి శ్రీనివాస్ మాదిగ, మాజీ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ మాదిగ, మండల ఇన్‌చార్జి అంబాల నరేష్ మాదిగ పేర్కొన్నారు. మాదిగలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలనే లక్ష్యంతో ఉద్యమనేత మందకృష్ణ మాదిగ 35 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారని అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల, పట్టణ నూతన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణ మాదిగ సాగించిన సుదీర్ఘ పోరాటం దేశవ్యాప్తంగా అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి పెన్షన్లు, మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాలు కీలక పాత్ర పోషించాయని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తొలుత రూ.2 లక్షల వరకు వైద్యసేవలు అందుబాటులోకి రాగా, ప్రస్తుతం ఆ పరిమితి రూ.10 లక్షలకు చేరిందని తెలిపారు. ఇలాంటి అనేక సంక్షేమ పథకాల వెనుక మందకృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తి ఉందని పేర్కొన్నారు. 35 ఏళ్లుగా హక్కుల సాధన కోసం ఉద్యమించిన ఎమ్మార్పీఎస్ ఇక రాజ్యాధికార సాధన దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో త్వరలో ఏర్పాటు కానున్న రాజకీయ పార్టీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు, అధికారంలో సముచిత భాగస్వామ్యం సాధించడమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

›» నూతన కమిటీల ఎన్నిక

అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ మండల, పట్టణ నూతన కమిటీలను ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా తిప్పారపు అనిల్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా రెండోసారి కనకం శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా పల్లె శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా పల్లె శ్రీహర్ష మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు ఘనంగా సన్మానించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజ్యాధికార సాధనే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావుకు వినతిపత్రం
- డిసెంబర్ 15లోగా సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త సమ్మె



సుల్తానాబాద్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు సీఐటీయూ, పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 496 మంది ఆశా వర్కర్లు జేఏసీగా ఏర్పడి తమ హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలకు సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు గత ప్రభుత్వం రూ.9,900 గౌరవ వేతనం అందించిందని, ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.18 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు అందించాలని, విధుల్లో ఉండగా ఆశా వర్కర్లు మృతిచెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్‌ను కోరారు. డిసెంబర్ 15లోగా సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆశా వర్కర్లు సమ్మె చేస్తే రాష్ట్రంలో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాళ్ల స్వరూప, జ్యోతితో పాటు పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అధికారుల ఉన్నత స్థాయి సమావేశాలు

- 2027 పండుగల తేదీల ఖరారుపై ప్రజాభవన్‌లో స్థానాచార్యులు, అర్చకుల భేటీ
- ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ , దేవాదాయ అడ్వైజర్ కు రాజరాజేశ్వర స్వామివారి ప్రసాదాలు అందజేత
- ఆలయ వీటీడీఏ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష





వేములవాడ,నవంబర్,10:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన పలు కీలక సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. హైదరాబాదులోని ప్రజాభవన్‌లో తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల స్థానాచార్యులు, ముఖ్య అర్చకులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాబోయే 2027 సంవత్సరానికి సంబంధించిన వివిధ పండుగల తేదీలను అధికారికంగా నిర్ణయించడంపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ (ఐఏఎస్) దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతు రావు (ఐఏఎస్) , దేవాదాయ ధార్మిక అడ్వైజర్ గోవింద హరి తో వేములవాడ ఆలయ అర్చకులు, వేద పండితులు కలిసి స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదం మరియు నూతన 2027 క్యాలెండర్‌ను అందజేశారు.

›» వి టి డి ఏ అధికారులతో అభివృద్ధి పనుల సమీక్ష

అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వి టి డి ఏ)అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ముఖ్య అర్చకులు, స్థానాచార్యులు, వేద పండితులు మరియు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్





- నిందితుడి నుంచి 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- చాకచక్యంగా కేసును ఛేదించిన ధర్మారం పోలీసులు..
- సిబ్బందికి ఏసీపీ రివార్డులు

ధర్మారం,నవంబర్ 10 (ప్రజా జ్యోతి న్యూస్): వివిధ జిల్లాల్లో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన అంతర్‌జిల్లా దొంగను ధర్మారం పోలీసులు అరెస్టు చేశారు.నిందితుడి వద్ద నుంచి సుమారు 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, అతడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల సమన్వయంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వెల్లడించారు.మంగళవారం ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన కండ్లే బాపన్న కూలి పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగించేవాడని, కూలి పనుల ద్వారా వచ్చే ఆదాయం సరిపోక ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు.గతంలోనూ వివిధ ప్రాంతాల్లో బైకుల చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారన్నారు.ఇటీవల ధర్మారం మండలం మేదారం గ్రామానికి చెందిన పడిదం రాజయ్య తన ద్విచక్ర వాహనాన్ని ధర్మారం బస్టాండ్ వద్ద పార్కింగ్ చేసి వెళ్లగా,తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ధర్మారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి గురైన వాహనం ఆచూకీతో పాటు నిందితుడిని గుర్తించేందుకు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు.ఈ క్రమంలో మంగళవారం జగిత్యాల సమీపంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న బాపన్నను పట్టుకొని విచారించగా, పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని ఏసీపీ తెలిపారు. కోరుట్ల నుంచి జగిత్యాల, కరీంనగర్ హైవే మార్గంతో పాటు కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట వెళ్లే రహదారులను ఆసరాగా చేసుకొని వివిధ ప్రాంతాల్లో బైకులను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు.నిందితుడినుంచి సుమారు 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టు ద్వారా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.కేసును సమర్థవంతంగా ఛేదించిన పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ధర్మారం ఎస్ఐ ఏ.శ్రీకాంత్ తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

పోలీసు సిబ్బందికి ఏసీపీ రివార్డులు

బైక్ చోరీ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఏసీపీ గజ్జి కృష్ణ అభినందించి నగదు రివార్డులు అందజేశారు. ధర్మారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, మొహిషన్ పాషా, పోలీసు కానిస్టేబుళ్లలోకిని సతీష్, శిరీష్, తిరుపతి, స్టేషన్ రైటర్ సుందర్ సింగ్‌లకు రివార్డులు అందజేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి సూచించారు.

అంబేద్కర్ విగ్రహ ఐలాండ్ ఏర్పాటుకు అడుగులు

- అంబేద్కర్ జయంతి నాటికి రూ.50 లక్షలతో ఐలాండ్, కాంస్య విగ్రహం ఏర్పాటు
- టెండర్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని అధికారులకు ప్రభుత్వ విప్ ఆదేశాలు



సుల్తానాబాద్, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహ ఐలాండ్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు మంగళవారం అంబేద్కర్ సంఘం ప్రతినిధులు మంచిర్యాలలోని అంబేద్కర్ విగ్రహ ఐలాండ్‌ను సందర్శించి, అక్కడి డిజైన్‌ను పరిశీలించారు. సుల్తానాబాద్‌లోనూ అదే తరహాలో ఐలాండ్ ఏర్పాటు చేసేందుకు ఈ పర్యటన చేపట్టారు. అంబేద్కర్ జయంతి నాటికి రూ.50 లక్షల వ్యయంతో ఐలాండ్‌తో పాటు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు పనులు వేగవంతం చేయాలని, వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ టి. రమేష్, మండల విద్యాధికారి, సలహాదారు ఆరేపల్లి రాజయ్య, ఏడో వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, మున్సిపల్ ఏఈ రాజ్‌కుమార్, మంచిర్యాల మున్సిపల్ ఏఈ, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు న్యాతరి ప్రభాకర్, న్యాతరి శ్యాంసుందర్, న్యాతరి శ్రీనివాస్, న్యాతరి రాములు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువుటద్దం 'జనని ట్రస్ట్'.. నిరుపేద కుటుంబానికి అంత్యక్రియల సహాయం, భోజన సౌకర్యం



గంగాధర 10/నవంబర్/2026, (ప్రజా జ్యోతి): కులమతాలకు అతీతంగా, "మానవ సేవే మాధవ సేవ" అనే ఉదాత్తమైన ఆశయంతో గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామంలో 'జనని ట్రస్ట్' సేవా కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ ఈ ట్రస్ట్ గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది. రంగారావుపల్లి గ్రామానికి చెందిన దోమకొండ శంకరమ్మ (58) అనే మహిళ ఇటీవల మరణించగా, ఆమె మరణంతో తీవ్ర శోకంలో మునిగిపోయిన సదరు నిరుపేద కుటుంబానికి జనని ట్రస్ట్ సభ్యులు కొండంత అండగా నిలిచారు. శంకరమ్మ అంత్యక్రియలకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ట్రస్ట్ ప్రతినిధులు ఆమె భర్త రామయ్యకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా, అంత్యక్రియలకు హాజరైన బంధువులు, కుటుంబ సభ్యులకు ట్రస్ట్ ఆధ్వర్యంలోనే భోజన సౌకర్యాలను కూడా ఘనంగా ఏర్పాటు చేశారు. కులమతాలకు అతీతంగా సేవలు: గ్రామంలో ఏ కులానికి, ఏ మతానికి చెందిన వారైనా సరే... మరణం సంభవించినప్పుడు బాధిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అంత్యక్రియల ఖర్చులతో పాటు, భోజన ఏర్పాట్ల బాధ్యతను కూడా జనని ట్రస్ట్ పూర్తిగా తన భుజాలపై వేసుకుంటోంది. ఆపద సమయంలో దాతృత్వం చూపిస్తున్న ట్రస్ట్ సేవలపై రంగారావుపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి గ్రామంలోనూ జరిగితే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని అంత్యక్రియలకు హాజరైన బంధువులు అభిప్రాయపడ్డారు. ఈ సేవా కార్యక్రమంలో జనని ట్రస్ట్ వ్యవస్థాపకులు, రంగారావుపల్లి గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య, ఉపసర్పంచ్ ద్యావ బహదూర్ రెడ్డి, వార్డు సభ్యులు బండ అంజయ్య, సందేవేణి లావణ్య, తిరుపతి యాదవ్, న్యాతరి లింగయ్య, గాలి లక్ష్మీదేవి, అంజయ్య, గాలి వర్షిత, లక్ష్మీనారాయణ, జక్కుల ప్రశాంత్, దుమాల అరుణ – అనిల్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి పరామర్శ తెలియజేశారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్న జనని ట్రస్ట్ నిర్వాహకులకు, సభ్యులకు గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

అయాన్ సీడ్స్ తో అధిక పంట దిగుబడులు



మంథని, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): అయాన్ సీడ్స్ మధ్యస్థ ఎత్తు మొక్క పెరిగి, మంచి పిలకలు వచ్చి రోగాలను తట్టుకునే గుణం ఉంటుందని, గొలుసుకు వచ్చేసరికి గొలుసుకు 350 నుండి 400 వరకు వరి గింజలు వచ్చి అధిక పంట దిగుబడులు వస్తాయని జినేక్స్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మంథని మండలం నాగేపెల్లి గ్రామంలో జినేక్స్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్ అన్నదాత ఫెర్టిలైజర్స్ సీడ్స్ ఏజెంట్ తూర్పాటి రాము, ఏరియా సేల్స్ మేనేజర్ గనవేణి రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ కోత్త శ్రీనివాస్, రైతు దెబ్బట శ్రీశైలం పొలంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నాగేపెల్లికి చెందిన రెబ్బట శ్రీశైలం అనే రైతు 25 ఎకరాలలో అయాన్ 2025 అనే రకం వడ్లను సాగు చేస్తున్నాడు. గత సంవత్సరం ఏ సంగీ పంటలో జినేక్స్ కంపెనీకి చెందిన రాజా దొడ్డు రకం సీడ్స్ ను సాగు చేశాడు. ఈ సంవత్సరం బోనస్ వచ్చే అయాన్ 2025 అనే రకం వడ్లను సాగు చేస్తున్నాడు. ఈ గింజ మంచి రంగు, నాణ్యత ఉంటుందని మంచి పాలు పోసుకొని బాగా బలంగా ఉండి మార్కెట్లో అమ్మడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ వడ్లను పండించినప్పుడు నూక శాతం తక్కువగా ఉంటుందని పంట చివరి దశ వరకు కూడా ప్రతి గింజ పాలు పోసుకొని బలంగా ఉంటుందన్నారు. అయాన్ కు చెందిన సీడ్స్ కాండము దొడ్డుగా ఉండి బలంగా ఉండడం వల్ల పంట పడిపోయే పరిస్థితులు రావు, పంట పడిపోదు కాబట్టి దోమపోటు, తెగులు, పురుగు పట్టదని, రైతుకు అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఇలాంటి సన్న రకం బోనస్ వచ్చే పంటలు రైతులు వేసుకొని మంచి దిగుబడి సాధించాలని రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాకాలం రైతులు అందరూ ఇలాంటి ఎక్కువ దిగుబడి వచ్చి లాభాలు పొందే అయాన్ సీడ్స్ 2025 లాంటి పంటలు పండించి రైతులు అందరూ సంతోషంగా ఉండాలని తెలిపారు. ఏసంగి పంటలో జినేక్స్ కంపెనీకి చెందిన రష్మిక, తోపు సీంగ్, ధనాధన్ లాంటి పంటలను పండించి రైతులు అధిక లాభాలు పొందాలని అన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 10 ప్రజా జ్యోతి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి రోడ్డు భద్రత ప్రమాణాల అమలుపై సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్ల వద్ద ఆక్రమణలు తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. రోడ్లపై పశువులను వదిలే వారికి రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు వాటిని గోశాలకు తరలించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రధాన జంక్షన్ల వద్ద రేడియం స్టిక్కర్లు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం అందించే ప్రతిపాదనలు త్వరగా పంపాలని, గత ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రామ్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ భావ్‌సింగ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ గా అతికం రాజ శేఖర్ గౌడ్,జిల్లా కో కన్వీనర్ గా కొడారి శ్రీనివాస్ రెడ్డి నియామకం





కొత్తపల్లి / నవంబర్ 10 ,(ప్రజా జ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ గా అతికం రాజశేఖర్ గౌడ్ ను కో కన్వీనర్ గా కొడారి శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర యాక్టింగ్ ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి నియామక పత్రాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సంస్థగత కమిటీల నియామకానికి పనిచేయాలని పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా ముందుండి పోరాడాలని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర యాక్టింగ్ ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ విప్ విజయ రమణా రావును మర్యాదపూర్వకంగా కలిసిన ముదిరాజ్ పాలకవర్గం



కాల్వశ్రీరాంపూర్. నవంబర్ 10 (ప్రజా జ్యోతి) కాలువ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన. నూతన ముదిరాజు సంఘం పాలకవర్గం. ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు గారిని. మంగళవారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో.మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్.సర్పంచ్ బంగారి రమేష్. ముదిరాజ్ సంగం అధ్యక్షుడు చెప్పాల సారయ్య. ఉపాధ్యక్షులు చిలువేరి రమేష్. కార్యదర్శి కొలిపాక అనేష్. డైరెక్టర్లు రాజ్ కుమార్. కొమురయ్య. నాగరాజు. నరేష్. నవీన్. తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



కొడిమ్యాల,నవంబర్ 10,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని మేర సేవా సంఘం,స్వర్ణకార సంఘ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు.సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను కలిసిన నాయకులు రెండు సంఘాలకు ప్రత్యేక భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కేడీసీసీబీ చైర్మన్ గుడి మల్లికార్జున్ రెడ్డి,నసిరోద్దీన్,రాపర్తి నర్సింగరావు,లక్ష్మణ్,గంగాధర్,గజ్జెల కరుణాచారి, శ్రీనివాస్, రామగిరి లక్ష్మణ్, చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ధరలకు బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

- కనకదుర్గ ట్రేడర్స్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- కిలో బీపీటీ, కేఎన్ఎం రూ.66, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ రూ.79
- వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందించడమే లక్ష్యం



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 10 ప్రజాజ్యోతి: వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రత్యేక ధరలకు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా పెద్దపల్లి పట్టణంలో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని కనకదుర్గ ట్రేడర్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా పెద్దపల్లిలో ప్రత్యేక విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈకేంద్రంలో బీపీటీ,కేఎన్ఎం,ఎంఆర్వీ రకం బియ్యాన్ని కిలో రూ.66కు, ఆర్ఎన్ఆర్,తెలంగాణ సోనా రకం బియ్యాన్ని రూ.74కు, హెచ్ఎంటీ,జేఎస్ఆర్ రకం బియ్యాన్ని రూ.79కు విక్రయించనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కే. శ్రీనాథ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ప్రణవి కాలేజ్ వరకు నూతన రోడ్ల విస్తరణ, సైడ్ డ్రైన్ల నిర్మాణం

- పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీవాస్



మంథని, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): మంథని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ప్రణవి కాలేజ్ వరకు రూ. 90లక్షల డి.ఎం.ఎఫ్.టి నిధులతో నూతన రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభమైన అభివృద్ధి పనులను మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. మంథని పట్టణ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక సహకారంతో నిధులు మంజూరైనట్లు చైర్మన్ తెలిపారు. ఈ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు, మురుగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, నాయకులు జంబోజు సమ్మయ్య, ఎల్లెంకి వంశీధర్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం ప్రారంభం



వేములవాడ,నవంబర్,10:ప్రజాజ్యోతి. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని,దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్తీక మాస ఉత్సవాలు 2026 నవంబర్ 10వ తేదీ బుధవారం నుండి డిసెంబర్ 08వ తేదీ మంగళవారం వరకు కొనసాగనున్నాయి. ఈ పవిత్ర మాస పర్యవదినాల సందర్భంగా ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల (ముత్తైదువుల) ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహించబడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుహాసినులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ విశేష కార్యక్రమాన్ని ఆలయ ఏ ఈ ఓ జయకుమారి ప్రారంభించగా, వారి వెంట ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, రాధ, నూగురి నరేందర్,ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో అన్నదాన సేవ.. 150 మంది భక్తులకు అన్నప్రసాదంతో పాటు స్వీట్ల పంపిణీ



వేములవాడ,నవంబర్,10:ప్రజాజ్యోతి. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం వద్దమై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 150 మంది పేదలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదంతో పాటు స్వీట్లను పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 2041 రోజులుగా నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. దాతలు అందించే ప్రతి రూపాయి ఆకలితో ఉన్నవారి కడుపు నింపేందుకు ఉపయోగపడుతోందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. సమాజంలో ఎంతోమంది ఆకలితో అలమటిస్తున్న తరుణంలో మనకు ఉన్నదానిలో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, పితృదేవతల స్మరణ వంటి శుభ సందర్భాల్లో ఆడంబరాలకు దూరంగా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. ఈరోజు అన్నదాతలుగా బానాల సాయి త్రిషర్ పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు బానాల రాధిక, వీరభద్రస్వామి, సోదరీమణులు నమ్రత, నక్షత్ర, తాతయ్య, నానమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. అలాగే గోపన్నగారి హరికృష్ణ పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు శ్రీనివాస్ శర్మ, స్వప్న దంపతులు, కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ.. అన్నదాన కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు, సేవలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మనమందరం చేయి చేయి కలిపి ఆకలిలేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, మధు కవిత, గొట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం
- ఆహారం, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచన
- ప్రభుత్వ వైద్య పథకాల ప్రయోజనాలు ప్రతి రోగికి అందాలి



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 10 ప్రజా జ్యోతి:
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా అందాల్సిన వైద్య సహాయాన్ని సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రోగులకు అందించే ఆహారం, ఆసుపత్రి పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.మంగళవారం పెద్దపల్లిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ వార్డులు, లేబర్ రూమ్, క్యాజువాలిటీ, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న చికిత్స, వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందించాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల చూపుతున్న అంకితభావాన్ని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతగా సేవలందించాలని కోరారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని, వంటశాలలు, ఆహార తయారీ ప్రాంతాలు, భోజన ప్రదేశాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ పరిశుభ్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రభుత్వ వైద్య పథకాల ద్వారా పేద రోగులకు అందాల్సిన ప్రయోజనాలు ఎవరూ కోల్పోకుండా చూడాలని, అవసరమైన ఆరోగ్య కార్డులు, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగుల సమస్యలను సానుకూలంగా స్వీకరించి వెంటనే పరిష్కరించాలని, వైద్య సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై వాడీవేడి చర్చ

- ఎస్సారెస్పీ భూముల వివాదం పరిష్కరించాలని సర్పంచ్ వినతి
- మూడు పశువైద్య ఆసుపత్రుల్లో రెగ్యులర్ వైద్యులు కరువు
- రైతుల కోసం మార్కెట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ఇంకుడు గుంతల పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే అసహనం

మల్లాపూర్, నవంబర్ 10, ప్రజాజ్యోతి మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాల సమస్యలు ఒక్కొక్కటిగా తెరపైకి వచ్చాయి. ఎస్సారెస్పీ భూముల వివాదం నుంచి పశువైద్య సేవల వరకు సర్పంచులు పలు అంశాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీకాంత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.రత్నాపూర్ సర్పంచ్ గొండ రాజేంద్ర మాట్లాడుతూ ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు 1971లో జారీ చేసిన డీ–1 పట్టాల ఆధారంగా న్యాయం చేయాలని కోరారు. తమ భూములపై ఇతర గ్రామాలకు చెందిన వారు హక్కులు చెలాయిస్తున్నారని, దీంతో అసలైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.మండలంలోని మూడు పశువైద్య ఆసుపత్రుల్లో రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను విక్రయించుకునేందుకు



మార్కెట్ సదుపాయాలు కల్పించాలని, దళారుల వ్యవస్థను అరికట్టి రైతులకు మేలు చేయాలని కోరారు.

››» అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసహనం

సర్పంచులు ప్రస్తావించిన సమస్యలతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనుల తీరుపైనా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అధికారులను ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.భూగర్భ జలాల పెంపునకు చేపట్టాల్సిన ఇంకుడు గుంతల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జనవరిలో ఎల్ నినో ప్రభావం ఉంటుందని తెలిసినప్పటికీ నవంబర్ లో పనులు చేపట్టడంపై అధికారుల ప్రణాళికను ప్రశ్నించారు. డిసెంబర్ లోనే నీటి సమస్యలు ఎదురైతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. మిషన్ భగీరథ ద్వారా నిరంతర నీటి సరఫరా జరిగేలా చూడాలని, భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

వృద్ధుల సౌకర్యార్థం కోసం కుర్చీలు బెంచీలు అందించిన న్యాయవాది

► చిర్ర దిలీప్

గొల్లపల్లి నవంబర్ 10 ప్రజాజ్యోతి గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు న్యాయవాది జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిర్ర దిలీప్ వృద్ధుల వికలాంగుల ప్రజల సౌకర్యార్థం కోసం గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్కు చేరులు బెంచీలు అందించి గ్రామ సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి సిబ్బందికి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్నవార్డు సభ్యుడు చెవుల మద్ది మల్లేశం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జేరిపోతుల నరేష్ ఉపాధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ స్టాఫ్ నర్సులు జ్యోతి రాణి గంగాభవాని అలాగే ఫార్మసిస్ట్ లత జూనియర్ అసిస్టెంట్ రమేష్ ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు ఇంత చక్కటి కార్యక్రమాన్ని చేసిన చిర్ర దిలీప్ ని గ్రామస్తులు గ్రామ సర్పంచ్ నీరజ సతీష్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న ప్రభుత్వ ఆసుపత్రి యాజమాన్యం అభినందించారు.



తెలంగాణ ఉద్యమ గేయకవి అందెశ్రీకి ఘన నివాళులు

■ పల్లె జీవనాన్ని పాటల్లో ప్రతిబింబించిన ప్రజాకవి అందెశ్రీ



ధర్మారం, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): ప్రజల జీవితాలను అక్షరాల్లో ఆవిష్కరించి, ప్రకృతి సౌందర్యాన్ని కవిత్వంలో పలికించి, మానవ సంబంధాల ఔన్నత్యాన్ని పాటల రూపంలో ప్రపంచానికి పరిచయం చేసిన విశిష్ట కవి అందెశ్రీ అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల శాఖ అధ్యక్షుడు బొల్లి నందయ్య కొనియాడారు.మంగళవారం ధర్మారం మండల కేంద్రంలో డాక్టర్ అందెశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ.. అందెశ్రీ కలం నుంచి జాలువారిన ప్రతి గీతంలో తెలంగాణ మట్టి పరిమళం, పల్లె ప్రజల జీవన సంఘర్షణ, ప్రకృతిపై ప్రేమ స్పష్టంగా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన రచనలు అక్షరాయుధాలుగా నిలిచాయని, ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయని అన్నారు.అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య అని, ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని రేపర్తి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి, పాఠశాల విద్యకు దూరమై పశువుల కాపరిగా జీవనం సాగించారని గుర్తుచేశారు. అయినప్పటికీ తన అసాధారణ ప్రతిభతో ఆశువుగా పాటలు పాడుతూ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర గీతంగా అందెశ్రీ రచించిన గేయాన్ని ప్రభుత్వం గుర్తించడం ఆయన సాహితీ ప్రతిభకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పదండి మల్లేశం,అంబేద్కర్ అవార్డు గ్రహీత సుంచు మల్లేశం, నాయకులు ఇరుగురాల రాజనర్సు,లక్ష్మణ్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

సన్న వడ్ల ధరల పతనంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

■ అన్ని రకాల సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.3,500 చెల్లించాలి

■ రైతు నాయకుడు ఏలేటి జలంధర్ రెడ్డి



రాయికల్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి)
సన్న వడ్ల ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని రైతు నాయకుడు ఏలేటి జలంధర్ రెడ్డి అన్నారు. గత 20 రోజుల క్రితం క్వింటాల్ పచ్చి సన్న వడ్లకు రూ.4,200 నుంచి రూ.4,500 వరకు ధర పలకగా, ప్రస్తుతం ధర రూ.2,500కు పడిపోయిందన్నారు. ఆర్.ఎన్.ఆర్, హెచ్.ఎం.టి రకాల ధరలు రూ.4,500 నుంచి రూ.2,800కు, కే.ఎన్.ఎం రకం ధర రూ.2,500కు తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నీనో ప్రభావంతో అననుకూల వాతావరణ పరిస్థితులు, అధిక పెట్టుబడుల కారణంగా ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం మరింత భారంగా మారిందన్నారు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చుకోవాలి, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్.ఎన్.ఆర్, హెచ్.ఎం.టి, కే.ఎన్.ఎం తదితర అన్ని రకాల సన్న వడ్లకు క్వింటాల్‌కు కనీసం రూ.3,500 ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా తక్షణమే ధాన్యం సేకరించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని ఏలేటి జలంధర్ రెడ్డి కోరారు.

మూఢనమ్మకాలను వీడండి.. విజ్ఞానాన్ని నమ్మండి



కొడిమ్యాల, నవంబరు 10 (ప్రజాజ్యోతి): మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సాంఘిక సమానత్వ సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ సూచించారు.మంగళవారం కొడిమ్యాల మండలం రామకృష్ణాపూర్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ శీతకాల ప్రత్యేక శిబిరంలో ఐదో రోజు మూఢనమ్మకాలపై అవగాహన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి. గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరేష్ మాట్లాడుతూ.. చేతబడి, బాణామతి పేరుతో ప్రజలను మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసు కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, సైన్స్ మ్యాజిక్ ప్రదర్శనలతో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఉదయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కనకయ్య, సర్పంచ్ నేరెళ్ల మహేష్, ఉపసర్పంచ్ బోగిని మల్లేశం, ప్రోగ్రాం అధికారి బండ్ల భాస్కర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి

- అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి: ఎంపీడీవో రామకృష్ణ



కోరుట్ల రూరల్, నవంబర్ 10 (ప్రజాజ్యోతి) గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. మోహన్‌రావుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్డు, ఇంకుడు గుంత నిర్మాణ పనులకు ఎంపీడీవో రామకృష్ణ ముగ్గు పోసి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులతో పాటు కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరికెళ్ల లతిక నరేష్, ప్రధానోపాధ్యాయులు సురేష్, వార్డు సభ్యురాలు అక్కెవ్వ, గ్రామ కార్యదర్శి నర్సారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, కరోబార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై మొక్కజొన్న, పెసర విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బుగ్గారం, నవంబర్ 10(ప్రజాజ్యోతి): బుగ్గారం మండల రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీపై మొక్కజొన్న, పెసర విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. రబీ (యాసంగి) సీజన్‌లో పంటల సాగు కోసం నాణ్యమైన విత్తనాలను రాయితీ ధరలకు పంపిణీ చేస్తున్నారు. ఈ విత్తనాలు బుగ్గారం డీసీఎంఎస్ కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మొక్కజొన్నలో ధమ్ 206 రకం నాలుగు కిలోల ప్యాకెట్ ధర రూ.360 కాగా, పెసరలో ఎంజీజీ 385 రకం నాలుగు కిలోల ప్యాకెట్ ధర రూ.340గా నిర్ణయించారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. విత్తనాలు పొందాలనుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు నకలును వెంట తీసుకురావాలని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కోరుట్ల మున్సిపల్ కమిషనర్ హెచ్చరికల కొరడా!

- అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు
- ప్రజలకు కీలక హెచ్చరిక జారీ చేసిన కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర
- నిబంధనల ప్రకారం ఆమోదం పొందిన లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచన

కోరుట్ల, నవంబర్ 10 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లపై కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు భవిష్యత్తులో ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు కీలక హెచ్చరిక జారీ చేశారు. ఈ మేరకు కోరుట్ల మున్సిపల్ కమిషనర్ ప్రజలకు అవగాహన కల్పిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

– అక్రమ లేఅవుట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి!

కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని లేఅవుట్లు ఏర్పాటవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి రావడంతో ఈ విషయంపై ప్రజలను అప్రమత్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.

– ప్లాట్లు కొనుగోలు చేసే ముందు అనుమతులు పరిశీలించాలి!

ఎవరైనా స్థలం లేదా ప్లాటు కొనుగోలు చేసే ముందు సంబంధిత లేఅవుట్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని కమిషనర్ రాఘవేంద్ర సూచించారు. లేఅవుట్ ఆమోద పత్రాలు, సంబంధిత అనుమతులను పరిశీలించిన తర్వాతే



కొనుగోలు నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

– అనుమతి లేని లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఉండవు!

అనుమతి లేని లేఅవుట్లలో భవన నిర్మాణాలకు మున్సిపల్ అనుమతులు మంజూరు చేయబడవని కమిషనర్ స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతులు సైతం అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మంజూరు చేయబడతాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో నిర్మాణ అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రజలు గుర్తించాలని సూచించారు.

– ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే లక్ష్యం!

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో స్థిరాస్తులు కొనుగోలు చేసేటప్పుడు ఎలాంటి మోసాలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర ఈ ప్రకటన విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాటలు నమ్మి తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా, అధికారిక అనుమతులను నిర్ధారించుకున్న తర్వాతే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు.

– మున్సిపల్ కమిషనర్ కీలక సందేశం

ప్రజలు అప్రమత్తంగా ఉండండి. నిబంధనల ప్రకారం ఆమోదం పొందిన లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయండి. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర విడుదల చేసిన ఈ ప్రకటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ఆరుతడి సాగుతో నీటి ఆదా రైతులకు అదనపు ఆదాయం

- వరి రైతులకు అవగాహన కార్యక్రమం

బుగ్గారం నవంబర్ 10(ప్రజాజ్యోతి): వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో మద్దునూర్ గ్రామంలో ఆరుతడి సాగు పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సౌ అండ్ రీప్ క్లైమాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఆరుతడి సాగు విధానం, పొలాల్లో ప్రత్యేక గొట్టాల ఏర్పాటు, నీటి నిర్వహణ పద్ధతులను రైతులకు వివరించారు. సంప్రదాయ వరి సాగుతో పోలిస్తే ఈ పద్ధతిలో అవసరమైన సమయంలో మాత్రమే నీటిని అందించడం ద్వారా నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అంతేకాకుండా వరి పొలాల నుంచి వెలువడే మీథేన్ వాయు ఉద్గారాలను తగ్గించేందుకు ఈ విధానం దోహదపడుతుందని వివరించారు. ఆరుతడి సాగు పద్ధతిని శాస్త్రీయంగా అమలు చేస్తూ అవసరమైన వివరాలను నమోదు చేసి, పర్యవేక్షణ చేపడితే భవిష్యత్తులో కార్బన్ క్రెడిట్ల ద్వారా రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉంటాయని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. నీటి పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ సాగు విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాలిపెల్లి భారతి–మహేష్, ఉపసర్పంచ్ నక్క సునీల్, రైతులు రాచమడుగు సతీష్ రావు, రాధ చిన్నయ్య, కట్ట అంజయ్య, ముంజాల అంజయ్య, మాదాసు చిలుకలయ్య, విజ్జగిరి శ్రీనివాస్, బండ్ర లచయ్య తదితరులు పాల్గొన్నారు. సంస్థ ప్రాజెక్టు సమన్వయకర్త పూదరి స్వప్న, జిల్లా సమన్వయకర్త తాళ్లపెల్లి వినోద్ కుమార్, బృంద నాయకుడు పొరండ్ల గణేష్, సామల వినయ్, సంస్థ ప్రతినిధులు, గ్రామ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కంటికి రెప్పలా లయన్స్ క్లబ్

- పోగ్రామింగు చైర్మన్ ఎడమల బొజేందర్ రెడ్డి

గొల్లపల్లి నవంబర్ 10 ప్రజాజ్యోతి గొల్లపల్లి మండలం శంకర్రావుపేట గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరానికి వెల్లువెత్తిన స్పందన 34 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు మందుల పంపిణీ ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ దృష్టి కోల్పోకూడదు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ రోగులకు సహాయకులకు ఎడుమల భోజేందర్ రెడ్డి అన్నదానం గొల్లపల్లి గ్రామీణ ప్రాంత నిరుపేదల జీవితాల్లో పేరుకుపోయిన అంధకారాన్ని పారద్రోలి వారి కళ్లలో కొత్త కాంతులు నింపేందుకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది మండలంలోని శంకర్రావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి భాస్కర్ మాడెకర్ లయన్ చిదుర సురేష్ సహకారం సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు శంకర్రావుపేటతో పాటు వెంగాళాపూర్ శ్రీరాములపల్లి రాఘవపట్నం బి.బి.రాజుపల్లి మల్లన్నపేట గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు కార్యక్రమాన్ని ప్రోగ్రామింగ్ చైర్మన్ ఎన్నారై ఎడుమల భోజేందర్ రెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్ సర్పంచ్ గోలి గంగారెడ్డి మెడిపెల్లి రాంరెడ్డి ఉప సర్పంచ్ రంజిత్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు సేవతోనే సమాజ వికాసం ఎడుమల భోజేందర్ రెడ్డి నిరుపేదలకు చూపునివ్వడం కంటే మిన్నయైన పుణ్యకార్యం మరొకటి లేదని ప్రోగ్రామింగ్ చైర్మన్ ఎడుమల భోజేందర్ రెడ్డి అన్నారు ఆర్థిక సమస్యలు అవగాహనా లోపంతో గ్రామీణులు కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేసి చూపు కోల్పోతున్నారని అలాంటి వారికి ఈ శిబిరం పునర్జన్మనిస్తుందని పేర్కొన్నారు మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ బృందాన్ని ఆయన అభినందించారు చీకట్లను



పారద్రోలడమే ధ్యేయం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ డబ్బు లేదన్న కారణంతో ఏ ఒక్క పేదవాళ్ళు అంధకారంలో మగ్గకూడదన్నదే తమ సంస్థ ఆశయమని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ స్పష్టం చేశారు పేదల కళ్లలో ఆనందమే తమ సేవా ప్రస్థానానికి సార్థకతని రోగులకు రవాణా అత్యాధునిక శస్త్రచికిత్సలు మందులు అద్దాలు భోజన వసతిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు 34 మందికి శస్త్రచికిత్సలు ఘనంగా అన్నదానం శిబిరంలో వైద్య నిపుణులు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించి కంటి శుక్లాలతో బాధపడుతున్న 34 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు వారిని ప్రత్యేక బస్సులో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా లెన్సులు అమర్చి ఆపరేషన్లు చేస్తున్నారు శిబిరానికి వచ్చిన రోగులు సహాయకులకు ఎడుమల భోజేందర్ రెడ్డి సొంత ఖర్చులతో అన్నదానం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కిషన్ తిరుపతి రెడ్డి నాయకులు అవారి చందు గంగరాజం లయన్స్ క్లబ్ కోశాధికారి సట్ట సురేష్ పాస్ట్ సెక్రటరీ సాయిని నరహరి వెంకటస్వామి ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ పాలకవర్గ సభ్యులు మరియు పాల్గొన్నారు